వల్లంపాటి వెంకటసుబ్బయ్య

పరిష్కారం

నిద్ర లేచి, నిద్ర పట్టని రాత్రి ఆలోచనల్లా రేగిన జుట్టుని గోళ్ళతో దువ్వుకొని, లైటు వేసి, అద్దంలో ముఖం చూసుకుంది లలిత.

సుఖం లేని నిద్రలో ఎర్రగా ఉబ్బిన కళ్ళు, కళ్ళ కింద నల్లని చారికలు, బుగ్గల మీద నాజూకుతనం తగ్గిన చర్మం, నోటి కిరువైపులా గీత గీసినట్టున్న ముడతలు, గడ్డంకింద జారుతున్న గడ్డం—అన్నిటినీ మించి నువ్వులు, బియ్యం కలిపి కుప్ప పోసినట్లున్న తల.

''ముప్పై అయిదేళ్ళకే ముసలితనం'' అనుకుంది లలిత.

తనతోపాటు చదువుకుని, ఇప్పుడు తనతోపాటే ఉద్యోగం చేస్తున్న నీరజ తనలా ఉండదు. దానికి పదేళ్ళుగా వయసు ఆగిపోయింది.

''ఎందుకే?'' అంటుంది తాను.

''నీ కర్థంకాదులే'' అంటుంది నీరజ— ఒక కన్ను మూసి.

''నీకు పూర్తిగా సిగ్గులేదు'' అంటుంది తాను.

''నీకుమాత్రం ఎందుకుండాలే'' అంటుంది అది.

తన ఆలోచనకు నవ్వొచ్చింది లలితకు. నవ్వుకుంటూ కిటికీలోంచి బయటికి చూసింది. తొలి వెలుగు పసుపు పచ్చగా, చలి నులివెచ్చగా ఉన్నాయి. గది తలుపు తీసుకొని హాల్లో కొచ్చింది లలిత.

శివరామయ్య ముఖం కడగటం పూర్తిచేసి, మొదటి కప్పు కాఫీ కోసం ఉడిపి హోటలుకు బయల్దేరుతున్నాడు.

''వాళ్ళెప్పు డొస్తారుట?'' అన్నాడు లలితను చూచి చిరునవ్వుతో.

''తొమ్మిది గంటలకు.''

''ఏమిటే అప్పుడే నిద్రలేచావ్? ఈ రోజు ప్రైవేటు పిల్లలు రారుగా'' అంది సరస్వతమ్మ అప్పుడే తెల్లవారినందుకు చిరాకు పడుతూ.

''కాని వాళ్ళొస్తారుగా.''

''ఎవరూ?''

''నీరజ చెప్పిన వాళ్ళు'' అంది లలిత ఎలా చెప్పాలో అర్థంకాక.

''ఎన్ని గంటలకూ?'' అంది సరస్వతమ్మ విసుగ్గా.

ఆ విసుక్కు అలవాటుపడిపోయిన లలిత బాత్‌రూమ్‌లోకి వెళ్ళింది. నెమ్మదిగా పళ్ళు తోముకుని, రెండుసార్లు సబ్బుతో ముఖం కడుక్కొని, బాత్‌రూమ్‌లోని అద్దంముందు నిలబడి ముఖం తుడుచుకుంది. అద్దంలో తన ప్రతిబింబాన్ని చూస్తుంటే చిలిపి ఆలోచన లొచ్చాయి లలితకు.

''మీరు నవ్వితే చాలా అందంగా ఉంటారు'' అన్నాడు ఒకతను చాలాకాలం క్రితం.

తాను నవ్వితే కుడి బుగ్గమీద నొక్కుపడేది ...

లలిత ఒకసారి అద్దంలో తన ప్రతిబింబాన్ని చూచి సాధ్యమైనంత చిలిపిగా నవ్వాలని ప్రయత్నించింది.

బుగ్గమీద సొట్ట పడిందికానీ — అది పదేళ్ళ ముందున్నంత లోతుగా, వాజూగ్గా ఆమెకే అనిపించలేదు.

''ముప్పై అయిదేళ్ళకే ముసలితనం'' అనుకుంది.

శివరామయ్య కాఫీ తాగి, పేపర్ కొనుక్కొని తిరిగొచ్చాడు. లలిత బాత్‌రూమ్ లోనుంచి బయటికొచ్చేసరికి లైటు కింద పేపరు చదవటానికి సిద్ధపడుతున్నాడు.

''ఏమండీ! తొమ్మిది గంటలకు లలితను చూడ్డానికి వాళ్ళొస్తారుగా'' అంది సరస్వతమ్మ.

''అవును— వస్తారు... ఈ ఎన్. టి. రామారావు...''

''రాజకీయాలు అలా పక్కనపెట్టి, కాస్త వీలు చూసుకొని బజారుకు వెళ్ళొస్తారా?''

''ఆ— అలాగే... రవి నిద్రలేచాడా?''

''వాడి కప్పుడే తెల్లవారదు. మీరే వెళ్ళిరండి'' అంది సరస్వతమ్మ తన మామూలు విసుగు పద్ధతిలో.

''అలాగే ... పేపరు చూసి ... అన్నట్టు ...''

''డబ్బు నే నిస్తాలే, నాన్నా'' అంది లలిత.

''అలాగే లేమ్మా'' అంటూ మళ్ళీ పత్రికలో మునిగిపోయాడు శివరామయ్య.

ఎనిమిది గంట లౌతుండగా రవి నిద్రలేవటమూ, నీరజ రావటమూ ఒకేసారి జరిగాయి. అప్పటికి శివరామయ్య వార్తాపత్రికలో వాతావరణం వివరాలు శ్రద్ధగా చూస్తున్నాడు.

''మావారు వాళ్ళతో పాటొస్తారు'' అంది నీరజ చుట్టూరా చూసి ఆశ్చర్యపోతూ. ఎవరి ముఖంలోనూ చింతాకంత ఉత్సాహం కూడా కనిపించలేదు. లలిత ముఖం కూడా ముడుచుకుపోయే ఉంది.

''ఏమిటే అందరి ముఖాలూ ఇలా ఏడ్చోసారి

దివాలా తీసిన ట్టున్నాయి?'' అంది.

''ఏడోసారి దివాలా తీసేవాడు కోటీశ్వరుడై ఉంటాడు. మాలాంటి వాళ్ళకు మొదటిసారి చాలు.'' నిరాశగా అన్నది లలిత.

నీరజకు పరిస్థితి అర్థం కాలేదు.

''ఇదో ఇలాగా మాట్లాడావంటే నిన్ను ఒప్పుకో వద్దని వారి ఫ్రెండుతో చెప్పమని మా వారితో చెబుతాను.'' చిలిపిగా అంది నీరజ, వాతావరణాన్ని కాస్త మార్చాలన్న ఉద్దేశంతో.

కానీ వాతావరణం మారలేదు. లలిత నవ్వలేదు.

''నా రామచిలకా! ఏడుపు మొహం ఆడదాన్ని ఏ మగాడూ మెచ్చడే. నవ్వవే. నవ్వవే.''

లలిత నవ్వింది — కాస్త నీరసంగా, నిరాశగా.

''అత్తయ్యగారూ! మీ కూతురు చాలా నీరసంగా ఉంది. ఒక డోసు మాంచి కాఫీ పంపండి.'' గట్టిగా అంది నీరజ.

నీరజ, లలిత గట్టిగా నవ్వారు.

గదిలో కొచ్చిన సరస్వతమ్మ మాత్రం నవ్వలేదు.

''ఇదో ... ఇలా చూడు ... ఈ వస్తువులు తెప్పిస్తావా?'' అంది ఒక పట్టీని లలిత చేతిలో పెడుతూ.

పేపరు చదువుకుంటున్న శివరామయ్య, అప్పుడే పళ్ళు తోమాలా, వద్దా అని ఆలోచిస్తున్న రవి ఒక్కసారిగా తాము వెళ్ళొస్తా మన్నారు.

ఒకర్నొకరు అనుమానంగా చూసుకున్నారు.

చివరకి రవే గెలిచాడు.

''సరే. నువ్వే వెళ్ళి రారా'' అన్నాడు శివరామయ్య.

లలిత ఇచ్చిన డబ్బులందుకొని రవి బజారుకు వెళ్ళాడు. శివరామయ్య మళ్ళీ పేపర్లోకి తల దూర్చాడు.

''ఇంత పొద్దెక్కినా ఇల్లు ఇంకా ఇలా ఉందేమిటే?'' అంది నీరజ.

''ఎలా ఉంది?''

''అప్పుడే చెప్పాగా?''

నీరజ కోపానికి లలితకు నవ్వొచ్చింది.

నీరజ ఇల్లు సర్దటం ప్రారంభించింది. ఇంట్లో అందరూ చేతులు తుడిచిన కర్టెన్స్ తీసేసి, ఉతికింది వేసి, నడి వీధిలో కాగితపు ముక్కల్లా పడి ఉన్న పాతగుడ్డల్ని మూట గట్టి, దాచి, పక్కింట్లో నుంచి నాలుగు మంచి కుర్చీలు తీసుకొచ్చి వేసి, వాటిముందు ఒక టీపాయ్ లాంటి దాన్నివేసి, దాని ముందు మాసిన డోర్ కర్టెన్‌ను తిరగేసి పరచి, దానిమీద కాస్త శుభ్రంగా చిరిగిపోకుండా ఉన్న పుస్తకాల్ని ఉంచింది.

పత్రికలోని చివరి వాక్యాలు కూడా చదవటం పూర్తిచేసిన శివరామయ్య హాల్లో కొచ్చి చూసి, ''ఇదేమిటి హాలు ఇంత శుభ్రంగా ఉంది!'' అని ఆశ్చర్యంగా ముఖం పెట్టి వంటింట్లోకి వెళ్ళాడు.

తొమ్మిది గంటలు కావచ్చింది.

నీరజమళ్ళీ గదిలో కొచ్చి లలితను పెళ్ళి చూపులకు తయారు చేయటం ప్రారంభించింది.

''అదికాదే. కొంపలో నాలుగు కుర్చీలుకూడా లేవు. నీ సంపాదనంతా ఏమవుతోంది?'' అంది నీరజ కూర్చుంటూ.

వంటింట్లోంచి నేతిలో వేగుతున్న జీడిపప్పు వాసన గుబాళించటం ప్రారంభించింది.

''ఆ వాసన చూడవే. అదే నీకు జవాబు'' అంది లలిత.

నీరజ లలితకు జడ వేయసాగింది.

''ఏమిటో ఈ వయస్సులో పెళ్ళిచూపులు... అలంకరణలు...'' విసుగ్గా అంది లలిత.

''నాటకాలాడకే. లోపల్లోపల నీ కిష్టంగా ఉందా, లేదా?''

''ఇష్టమే ననుకో ...''

''మరి నోరు మూసుకో ...''

''ముఖంలోని ముసలితనం కప్పెయ్యటానికి పౌడర్లు, క్రీములు రాస్తున్నావు. ముగ్గుబుట్టలా ఉన్న ఈ తలనేం చేస్తావే?'' అంది లలిత.

''నీ తల ముగ్గుబుట్టలాఉందా? ఎవడే అన్నది? నల్లని ఆకాశంలో మెరుపులా అక్కడక్కడా వో తెల్ల వెంట్రుకుంది ... ఇంతకూ నీకు తల నెరిసే వయస్సొచ్చిందని ఎవరంటారే?''

లలిత చిన్నగా నవ్వింది.

''ఇదే ఈ పెళ్ళి కాని వాళ్ళతో వచ్చిన తంటా. రాకముందే తమకు ముసలితనం వచ్చేసిందనుకుం

Join at Once

"BEST RESULT VERY LOW FEE!!
EFFICIENT POSTAL COACHING!!!

POPULAR & EFFICIENT EDUCATIONAL INSTITUTE IN THE WORLD!

Recognised and Affiliated with I.A.E., I.B.A.M & COM. UNIVERSITY

1. M.B.A., M.B.M., A.M.I.B.M., D.B.A., D.B.M., L.L.B. & B.G.L. (All degree Holders are eligible)
2. MYSORE/ANDHRA B.A., B.Com. & ANDHRA MATRIC (No Previous School or College study is required)
3. OSMANIA B.A., B.Com., (One sitting) (P.U.C./INTER Passed are allowed)
4. S.V. M.A., M.Com 5. COM. UNIVERSITY: INTER, D.Com, B.Com, B.Com (Hons) & M.Com. (No previous School/College study is required)
6. A.M.I.E. (Civil/Mech/Electrical) & A.M.I. Mech. E Equalent to B.E. (S.S.L.C., S.S.C., H.S.C., P.U.C., INTER PRE-DEGREE, ENGG. DIPLOMA HOLDER, B.Sc. Passed/Failed are eligible) 7. BANK OFFICER/CLERKS
8. ACCOUNTANCY 9. ALLOPATHY 10. SERVICE COMMISSION 11. HIGHER SECONDARY.

For full particulars please send Rs. 3/- by M.O.

GUARANTEE CERTIFICATE WILL BE ISSUED

SRI MURUGAN TUTORIALS

(Estd. 21-3-1952 Govt. Regd. No.: 3072) H.O: RISHIVANDIYAM, 606 205-TAMILNADU

REGIONAL OFFICE 41, ARCOT ROAD, KODAMBAKKAM MADRAS-600 024 PHONE 426480

టారు. మే మలా కాదు. వయసొచ్చినా రాలే దనుకుంటాం'' అంది నీరజ.

''ఎందుకూ?'' నవ్వుతూ ప్రశ్నించింది లలిత.

''షటప్. అప్పుడే మతి చెడగొట్టుకోకు. అది కాదూ ... ఆయనేం పదహేనేళ్ళ బాలా కుమారుడు కాడుగా? నీకు జుట్టు నెరిస్తే ఆయనకు రాలి పోయింది. అంతే తేడా.''

''గంతకు తగ్గ బొంత'' అంది లలిత.

''కాదు. ఈడు జోడు.''

ఇద్దరూ బిగ్గరగా నవ్వారు.

నవ్వులు ఆగక ముందే శివరామయ్య లోపలి కొచ్చాడు— విభూతి రేఖల మీద ఎర్రగా వెలిగి పోతున్న కుంకుమను సర్దుకుంటూ.

''వాళ్ళొచ్చే వేళయింది. అంతా రెడీయేకదమ్మా'' అన్నాడు.

''రెడీ'' అంది నీరజ.

''లల్లీ నువ్వు త్వరగా తెములు. టిఫిన్ పూర్తయిందో. లేదో చూడు.''

లలిత వంటింట్లో కెళ్ళింది.

ఇస్త్రీ పంచ నలిగిపోకుండా జాగ్రత్త పడుతూ శివరామయ్య కుర్చీలో కూర్చున్నాడు.

''బాబాయిగారూ!''

''ఏమిటమ్మా?'' అన్నాడు శివరామయ్య.

''లల్లీ పెళ్ళి కుదిరితే — కుదిరేలాగే ఉందనుకోండి — ఏం చేయా లనుకుంటున్నారు?''

''అంటే?''

''వెంకటేశ్వర్లుగారు మంచి ఉద్యోగంలో ఉన్నారు. కష్ట సుఖాలు తెలిసినవారు. కట్నం ఆశించ వని మా వారితో చెప్పారట కూడా. కానీ ... పెళ్ళి ఖర్చులు ఎంత కాదన్నా పదివేలవుతాయి. ఆ డబ్బు...''

నీరజ వేయని ప్రశ్నకు జవాబుగా శివరామయ్య జేబులోంచి ఒక కాగితాన్ని తీసి, మడత విప్పి నీరజ కందిచ్చాడు.

అది బ్యాంకువా ళ్ళిచ్చిన నోటీసు.

తను బాంకులో తాకట్టు పెట్టిన ఇంటికి సంబంధించిన అసలు, వడ్డీ కలిపి తొమ్మిదివేల ఎనిమిది వందలైందనీ, దాన్ని నోటీసు అందిన నెల రోజుల్లోగా చెల్లించాలని, చెల్లించనిపక్షంలో ఇల్లు వేలం వేయబడుతుందని అందులో ఉంది.

దాన్ని చదివిన నీరజకు కళ్ళు చీకట్లు కమ్మినట్టనిపించింది. ఎంతోకాలం తరవాత చిగురించిన ఆశ ఎండిపోయింది. ఎదుట కూచున్న శివరామయ్య మీద కోపం, అసహ్యం పొంగివచ్చాయి. కష్టపడి తన్ను తాను తమాయించుకుంటూ మెల్లగా అడిగింది:

''అంటే ... లల్లీ పెళ్ళి చేయటం కుదర దంటారా బాబాయిగారూ?''

శివరామయ్య మెల్లిగా నవ్వాడు.

''పెళ్ళి జరిగి తీరుతుంది'' అన్నాడు.

''ఎలాగ?''

''ఇల్లు అమ్మేయా లనుకుంటున్నాను. ఈ పెంకుల కొంప ఎంత పాతదైనా ఇరవై వేలు వస్తాయి. మనకు ఏసమస్యా లేదు.''

''అంటే...''

''పదివేల రూపాయలు అప్పుకు, మిగిలినపది వేలు లల్లెమ్మ పెళ్ళికి...'' హాయిగా నవ్వాడు శివ రామయ్య.

''ఇల్లు పోతుందిగా. బాబాయ్.''

''ఎలాగూ పోతుంది. పదివేల రూపాయల అప్పు తీర్చటం ఎలాగూ నా చేత కాదు. ఇల్లు అమ్మటం తప్పదు. ఆ పని ఇప్పుడే చేస్తే అప్పూ తీరుతుంది, పెళ్ళీ అవుతుంది.''

''తరవాత?''

''తరవాత సంగతి తరవాత.''

''ఇల్లు అమ్మడం వద్దు, నాన్నా.'' అంతవరకూ బయట ఉన్న లలిత లోపలి కొస్తూ అంది.

''అమ్మకపోతే ఎలా కుదురుతుం దమ్మా?'' అన్నాడు శివరామయ్య.

''నా పెళ్ళికోసమని మీరు ఇంటిని పోగొట్టు కోవటం నా కిష్టం లేదు.''

''ఇల్లు అమ్మకపోతే అప్పూ తీరదు, నీ పెళ్ళీ కాదు.''

''అప్పు సంగతి తరవాత ఆలోచిద్దాం. పెళ్ళిని గురించి మీరు బాధపడకండి.'' తల వంచుకొని కాస్త సిగ్గుగా అంది లలిత.

''అంటే?'' ఆశ్చర్యంగా అన్నాడు శివరామయ్య.

తల వెంట్రుకలు రాలుటకు కారణము పేలు

పేలను, ఈరులను నశింపజేయుటకు కెన్జ్ వాడండి. సువాసనతోకూడిన పేలనాశిని కెన్జ్ హెయిర్ ఆయిల్‌ను వాడి మీ కేశములను కాపాడుకొనండి.

కెన్జ్

పేలనాశిని మందు

దీనిలో ఈరులను నశింపజేయు బెన్‌జోకెయిన్ ఉన్నది.

నిర్భయముగా వాడుటకు వీలైనది.

PHARM PRODUCTS

ఫార్మ్ ప్రోడక్ట్స్

తంజావూరు-613 007 తమిళనాడు

అన్ని జిల్లాలకు డిస్ట్రిబ్యూటర్లు కావలెను.

Chhaya/PP/222

"నా దగ్గర పెళ్ళికి సరిపోయే డబ్బుంది."

తన చెవుల్ని తనే నమ్మలేకపోయాడు శివ రామయ్య.

"అంటే?" అన్నాడు మళ్ళీ, ఏమనాలో తోచక.

"ఏడెనిమిదేళ్ళుగా కొంచెం కొంచెంగా డబ్బు దాచుకుంటూ వచ్చాను. అది దాదాపు పదివేలైంది" అంది లలిత తప్పు చేసిన దానిలా.

"పది వేలే!"

అవునన్నట్టు తలూపింది లలిత.

శివరామయ్య కనుబొమలు ముడిపడి, మళ్ళీ విచ్చుకున్నాయి. క్షణం తరవాత సంతృప్తిగా నవ్వాడు శివరామయ్య.

"అలాగైతే నా కింకేం కావాలి? చూశావా, నీరజమ్మా! మా లల్లమ్మ తన పెళ్ళికి అన్ని ఏర్పాట్లూ తానే చేసుకుంది. నా భాధ్యత ఎంత తగ్గించిందో చూడు. ఇక సంబంధం కుదరడమే తరువాయి ..." శివరామయ్య లేచాడు.

"బాబాయిగారూ! ఒక మాట ..."

"ఏమిటమ్మా?"

"పెళ్ళిసంగతి ఎలాగో సర్దుకుంటుందనుకోండి— ఇంటి సంగతి?"

శివరామయ్య గట్టిగా నవ్వాడు.

నీరజ, లలిత ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు.

"ముందు పెళ్ళి, తరవాత ఇంటి విషయం..."

"అలాగంటే ఎలా, నాన్నా? ఇంటి విషయంకూడా ఆలోచించాలి" అంది లలిత.

"ఆలోచించాల్సిందే. కానీ మన దగ్గర ఇరవై వేలు లేవుగా. ఉంది పదివేలే?" శివరామయ్య ముఖం చిత్రంగా ముడుచుకుంది.

సరస్వతమ్మ గదిలోంచి వచ్చింది.

"ఏమండీ! అందరూ నన్ను వేధించుకు తినే వాళ్ళే! ఆ రవిగాణ్ణి ఇంట్లో ఉండరా అంటే వెళ్ళి పోతున్నాడు— చూడండి" అంది.

"రవి టిఫిన్ తిన్నాడా?" శివరామయ్య అడిగాడు.

"వూఁ ... తిన్నాడూ ..."

"అలాగైతే వెళ్ళనీ. వాడు ఉండి ఏం చేయా లిక్కడ?"

"నా ఖర్మ!" మళ్ళీ వంటింట్లోకి నడిచింది సరస్వతమ్మ.

శివరామయ్య భార్యను అనుసరించాడు.

నీరజ వాళ్ళ వెనకే వెళ్ళి తలుపు మూసింది.

లలిత అలాగే తల వంచుకొని నిలబడి ఉంది.

"ఏయ్, రాస్కెల్! ఇలా రా!" అంది నీరజ.

లలిత ముందుకొచ్చింది.

నీరజ అకస్మాత్తుగా లలితను గట్టిగా కౌగలించుకొని ముద్దుపెట్టుకుంది.

"ఛీ! నీకు సిగ్గు లేదే" అంది లలిత బుగ్గ తుడుచుకుంటూ.

"నీకుమాత్రం ఉందేమిటే?"

"అవును. నాకు నిజంగా సిగ్గు లేదు. ఉంటే నా పెళ్ళికి దొంగతనంగా అంత డబ్బు దాచుకునేదాన్ని కాను."

లలిత కళ్ళనిండా నీళ్ళు నిండాయి.

ఫోటో - ఆర్. ఉదయ భాస్కర్‌రావు

"నేను ఆ ఉద్దేశంతో అనలేదు, లల్లీ. అదేమిటే ఇప్పుడు కళ్ళనీళ్ళు పెట్టుకుంటావ్? తప్పుకదూ? వాళ్ళొచ్చే వేళయింది. కళ్ళు తుడుచుకో. ఇలా నా ముందు కూచో. నీ మేకప్ ..."

"అదికాదు, నీరజా. ఒక మాట సూటిగా చెప్పు. నేను చేసింది తప్పంటావా?"

"కాదు ... కాదు ..."

"మా ఇంటి పరిస్థితి చూస్తున్నావుగా. అలాంటప్పుడు ..."

"చెప్పాగా. నువ్వు చేసింది తప్పు కాదు. నువ్వు సిగ్గుపడాల్సిన అవసరం లేదు."లలిత కళ్ళు తుడుస్తూ అంది నీరజ.

"నాన్నగా రేమనుకుంటారో ..."

"ఏమనుకుంటారు? తాను చేయవలసిన పని నువ్వు చేసి తన బరువు తగ్గించా వనుకుంటారు."

"రవి?"

"వా డేమనుకుంటే నీకేం?"

"అమ్మ?"

"పాటి అడదానిగా మీ అమ్మ నిన్నెప్పుడు అర్థం చేసుకుందే?"

లలిత జవాబు చెప్పలేదు.

"అంటే ఏమిటో తెలుసా? వివరించమంటావా?"

"అక్కర్లేదు" అంది లలిత నవ్వుతూ.

"వివరించటమే మంచిది. నిన్ను కాస్త రెచ్చ గొట్టాల్సిన అవసరం కనిపిస్తోంది — మరీ ముఖ్యంగా పెళ్ళి చూపులకు ముందు..."

ఇద్దరూ నవ్వుకున్నారు.

ఇంటిముందు స్కూటర్లు ఆగిన చప్పుడు కావటంతో నవ్వులు ఆగిపోయాయి.

"ఏయ్! వాళ్ళొచ్చినట్టున్నారే" అంది ఎగిరి గంతులేస్తూ నీరజ.

లలిత మనసులో సంతోషమూ, భయమూ ఉప్పెనగా పొంగి వచ్చాయి. రామకృష్ణ, వెంకటేశ్వర్లు లోపలి కొచ్చారు.

రామకృష్ణ లోపలికి రాగానే చుట్టూరా చూసి, కాస్త సంతృప్తిగా ముఖం పెట్టి కుర్చీ చూపించి, "కూర్చోండి" అన్నాడు.

వెంకటేశ్వర్లు చిరునవ్వుతో అందులో కూర్చు న్నాడు.

"ఫరవా లేదు" అనుకుంది కిటికీలోంచి తొంగి చూస్తున్న లలిత. వెంకటేశ్వర్లు బాగా ఒడ్డూ, పొడవూ ఉన్నాడు. రంగు నలుపు మాత్రం కాదు. తెలివితేటలు, చురుకుతనం కనిపించే కళ్ళు—చెంపల మీద వెంట్రుకలు కాస్త తెల్లబడ్డాయి ...

"నీకు అద్దం అక్కర్లేదు" అంది నీరజ.

"అంటే?"

"ఆయనగారి బుర్రచూడు ఎలా మెరిసిపోతోందో. దాన్ని చూచి బొట్టు పెట్టుకోవచ్చు."

"ఏదో గంతకు తగిన బొంత" అంది లలిత.

"కాదు. ఈడు, జోడు."

ఇద్దరూ మళ్ళీ చిన్నగా నవ్వుకున్నారు.

ఇతరులకు చెరలాటంగా, లలితకు ప్రాణ సంకటంగా పెళ్ళిచూపులు ముగిశాయి—ఫలహారాలు, కాఫీలు పూర్తయాయి.

"మా అన్నయ్య, వదిన వస్తా రనుకున్నాను. ఎందుకో వాళ్ళు రాలేక పోయారు" అన్నాడు వెంకటేశ్వర్లు.

లలిత తలవంచుకొని కుర్చీలో కూర్చుంది. పన్నెండు సంవత్సరాలుగా పాఠాలు చెబుతూ, క్లాసుల్ని గడగడలాడిస్తూ ఉన్నా, ఆమెకు చాలా భయమనిపించింది. వెంకటేశ్వర్లు గొంతు వింటే భయం ఎక్కువైనట్లు అనిపించింది.

"ఫరవాలేదులెండి" అన్నాడు రామకృష్ణ

నీరజ రామకృష్ణను కొరకొరా చూసింది. తానన్న మాట ఎంత బుద్ధిలేనిదో అప్పుడు స్ఫురించింది రామకృష్ణకు.

"నాకు కట్నాలు కానుకలు అక్కర్లేదు. పెళ్ళి కూడా సాధ్యమైనంత సింపుల్‌గా చేసెయ్యండి చాలు. మా అన్నయ్య, వదిన చూడాలంటే మరోసారి వస్తారు. కానీ వారు చూసి తీరాల్సిన అవసరం మాత్రం లేదు" అన్నాడు వెంకటేశ్వర్లు —లలిత వైపు చూచీ చూడనట్లుగా ఒక చూపు చూస్తూ.

ఆ చూపు గుచ్చుకున్నట్టనిపించింది లలితకు. వెంకటేశ్వర్లు మాటలు ఆమె మనస్సులో జాంకారం చేస్తూ తిరిగాయి.

"ఎంత మంచివాడు" అనుకుంది లలిత.

"లేద్దామా" అన్నాడు వెంకటేశ్వర్లు.

అందరూ లేచారు. రామకృష్ణ, వెంకటేశ్వర్లు బయటికి నడిచారు.

లలిత, నీరజ గదిలో కెళ్ళారు.

"అదేమిటే అలా కూర్చుండిపోయావ్, మాటా పలుకూ లేకుండా" అంది నీరజ.

"భయమేసింది. ఇతరుల్లాగా పాట పాడమంటా డేమోనని లోలోపల పాడలి వచ్చాను."

"నేనే గనక పెళ్ళికూతుర్నయితే పెళ్ళికొడుకుని శీర్షాసనం వేయమనేదాన్ని."

"వెయ్యమంటారా, సార్?"అప్పుడే లోపలికొచ్చిన రామకృష్ణ అన్నాడు.

లలిత నవ్వింది.

"నవ్వటం తరవాత. ముందు నాకు థాంక్స్ చెప్పండి" అన్నాడు రామకృష్ణ.

"ఎందుకూ?" అంది లలిత.

"ఏం, వెంకటేశ్వర్లు చెప్పిన మాటలకు మీ కర్థం తెలియలేదా? వివరంగా చెప్పమంటారా?"

"వద్దు" అంది లలిత సిగ్గుతో.

"నాకు చెప్పాలనిపిస్తోందండీ."

"ఇంటికొచ్చి నాకు చెప్పండి. మీకు నేను థాంక్స్ చెబుతాను. పదండి ముందుకు." నీరజ రామకృష్ణ ఎదమీద చేయివేసి తోసింది.

"ఇదేమిటి ముందుకు పదమని వెనక్కు తోస్తున్నావ్?"

"అరిగిపోయిన జోకులు" అంది నీరజ.

శివరామయ్య, సరస్వతమ్మ గదిలో కొచ్చారు.

నీరజ, రామకృష్ణ సెలవు తీసుకొని బయలుదేరారు.

నీరజ ఒక కన్ను మూసి "వెళ్ళొస్తానే లల్లీ... జాగ్రత్త" అంది.

రామకృష్ణ, నీరజ స్కూటర్ ఎక్కారు. నీరజ రామకృష్ణ భుజం మీద ఎడమ చేయి వేసి, కుడి చేత్తో అతని నడుమును పొదివి పట్టుకుంది.

"దీనికి నిజంగా సిగ్గులేదు" అనుకుంది లలిత.

స్కూటరు ముందుకు కదిలింది.

సంతోషంతో వెలిగిపోతున్న కూతురి ముఖాన్ని చూస్తూ ఉండిపోయాడు శివరామయ్య.

● ● ● ●

రెండోరోజు రాత్రి ఆలస్యంగా ఇంటి కొచ్చాడు రామకృష్ణ. ఎదురు చూచిచూచి సోఫాలో పడుకొని నిద్రపోయింది నీరజ. అర్ధరాత్రి దాటిన తరవాత తలుపు తడుతున్న శబ్దం విని నిద్ర లేచింది. భర్త మీదపడి రక్కేయాలన్నంత కోపంతో వెళ్ళి తలుపు తీసింది.

రామకృష్ణ లోపలి కొచ్చాడు.

"హలో ... అదేమిటి అప్పుడే నిద్రపోయావ్?" అన్నాడు రామకృష్ణ ఉత్సాహంగా. ఆ ఉత్సాహం సహజంగా అనిపించలేదు నీరజకు.

రామకృష్ణ ముఖాన్ని నిశితంగా చూసింది. అతని ముఖంలో విసుగూ, కోపమూ స్పష్టంగా కనిపించాయి నీరజకు.

"ఏమిటలా ఉన్నారు? ఎవర్తోనైనా పోట్లాడి వస్తున్నారా?" అంది.

"ఏం? నీ భర్త రత్నంలా లేనా?" అన్నాడు రామకృష్ణ నవ్వటానికి ప్రయత్నిస్తూ.

"చాల్లెండి మీ అరిగిపోయిన జోకులు. అసలు సంగతి చెప్పండి."

రామకృష్ణకు నిజం చెప్పాలనిపించింది.

"వెంకటేశ్వర్లుతో మాట్లాడి వస్తున్నాను" అన్నాడు.

"ఏమిటండీ? ఏమంటాడు?"

". . . ."

"డబ్బు ఆశ పుట్టిందా?"

"లేదు."

"మరేమట?"

"కారణం చెప్పలేదు.

"అంటే ... అంటే ... పెళ్ళి ..."

"లేదు."

నీరజ దిగ్భ్రాంతురాలై పోయింది.

కదిలేది, కదిలించేది

మీర్ సైదీతఫ్తా అనే మహా కవి వద్దకు వెళ్ళి, హుసేన్ కాషి అనే కవి తను వ్రాసిన గజల్ లోని మొదటి భాగం చదివి వినిపించాడు.

"నన్ను కదిలించ గలిగినదేదీ నీ కవిత్వంలో కానరాదు" అని తన అభిప్రాయం వెలిబుచ్చాడు తఫ్తా.

"నిన్ను కదిలించ గలిగిన శక్తి ఈ కవిత్వాని కేమి ఉంటుంది? గాడిద తన్నుకిగానీ నువు కదలవు" అని సమాధాన మిచ్చాడు కాషి.

- ప్రసీల్

"ఏం? లల్లీ నచ్చలేదట్నా? ఈ మగాళ్ళంతా ఇంతే. తాము కోతుల్లా ఉన్నా పెళ్ళాలు మాత్రం దేవకన్యల్లా ఉండాలనుకుంటారు. రాస్కెల్! ఆ చెంబు తలకాయగాడికి ..."

"కారణం తెలియకుండా అలా మాట్లాడ కూడదు, నీరజా."

"ఏమిటండీ ఆ కారణం?"

నీరజ కోపం క్షణక్షణానికీ పెరిగిపోతున్నట్లనిపించింది రామకృష్ణకు.

"నాకూ తెలీదు" అన్నాడు.

"వాడు చెప్పలేదా?"

"లేదు."

"మీరు అడగలేదూ?"

"అడిగాను. కానీ అతడు చెప్పలేదు."

"రాస్కెల్" అంది నీరజ.

"కారణం నెమ్మదిగా తెలుసుకుందాంలే—పడుకో" అన్నాడు తానూ పడుకుంటూ.

గులాబి మొగ్గలా వెలుగుతున్న నైట్ లాంప్ వెలుగులో గది ఎర్రగా కనిపిస్తోంది. రామకృష్ణ ఆలోచిస్తూ పడుకున్నాడు. తాను అన్నం తినలేదని రామకృష్ణకు జ్ఞాపకం రాలేదు. నీరజ జ్ఞాపకం చేయలేదు.

ఎంత ప్రయత్నించినా నిద్ర పట్టలేదు రామకృష్ణకు. భార్య నిద్రపోయిందేమోనని చూశాడు. గోడవైపు తిరిగి కదలకుండా పడుకొనుంది నీరజ. లలిత జ్ఞాపకం వచ్చింది రామకృష్ణకు.

నీరజ భుజం మీద చేయి వేసి తనవైపుకు తిప్పుకున్నాడు రామకృష్ణ.

నీరజ ముఖం కన్నీళ్ళతో తడిసి ఉంది. భర్త ముఖాన్ని చూడగానే దుఃఖం పొర్లి వచ్చింది నీరజకు.

"ఏమండీ! నిజం చెప్పండి. మీరేదో దాస్తున్నారు. నా దగ్గర మీకు దాపరికమా? నిజం చెప్పండి" అంది వెక్కిళ్ళ మధ్య.

ఇక దాచటం కష్టమనిపించింది రామకృష్ణకు. కానీ ఎలా చెప్పాలో అర్థం కాలేదు.

"ఎవరో లలిత ప్రవర్తనను గురించి చెడుగా వెంకటేశ్వర్లుతో చెప్పారు."

"ఆ చెంబు తలకాయగాడు ఆ మాటల్ని నమ్మాడా? కానివాళ్ళు గూడా దాన్ని గురించి చెడుగా చెప్పలేరండీ. ఆ విషయం నాకు తెలుసు. మీకూ తెలుసు."

"అయిన వాళ్ళు చెప్పొచ్చుగా?" అన్నాడు రామకృష్ణ.

"ఏమిటండీ అలా మతిలేకుండా మాట్లాడుతారు? అయిన వాళ్ళెందుకు అలాంటి మాటలు చెబుతారు? దాని పెళ్ళి చెడగొడితే వాళ్ళ కొచ్చే లాభ మేంటి?"

"లాభముంటే అపకారం చేయవచ్చునంటావా?"

"మీ మాటలు నాకేం అర్థం కావటం లేదు. మీరేదో దాస్తున్నారు. అందకుండా, పొందకుండా మాట్లాడుతున్నారు" అంది నీరజ విసుగ్గా.

"అందటం, పొందటం కాదు అసలు విషయం."

"మళ్ళీ ప్రారంభించారా మీ అరిగిపోయిన జోకులు. లల్లీని గురించి అంత చెడుగా ఎవరు చెబుతా రండీ మీ పిచ్చి కాకపోతే. ఉదయాన్నే నేను వెళ్ళి వెంకటేశ్వర్లుతో మాట్లాడతాను. అతడు విన్నవన్నీ తప్పని నిరూపిస్తాను. లల్లీని పెళ్ళి చేసుకోమని బతిమాలుతాను."

"అలాగే ..." అన్నాడు రామకృష్ణ.

"మీరూ వస్తారా?"

"అలాగే."

"ఉదయాన్నే వెడదామా?"

"అలాగే."

"ఏమిటండీ అన్నిటికి చిలకలా 'అలాగే, అలాగే' అంటున్నారు. ఈ పెళ్ళి తప్పిపోతే లల్లీ గుండె పగిలి చచ్చిపోతుందండీ. తనకు పెళ్ళి కుదిరిపోయిందని అందరితోనూ చెప్పుకుంటోందండీ" అంది నీరజ.

"అలాగా?"

"చూచారా—మీరేదో దాస్తున్నారు. మీకంతా తెలుసు. ఎవరండీ ..."

వీధి తలుపు గట్టిగా తడుతున్న చప్పుడు వినిపించింది.

"ఎవరూ?" అంది నీరజ భయంగా.

"ఎవరో చూద్దాం."

ఇద్దరూ వెళ్ళి తలుపు తీశారు.

మసక చీకట్లో శివరామయ్య నిలబడి ఉన్నాడు.

"ఏమిటి, బాబాయిగారూ, ఇలా వచ్చారు?" అంది నీరజ.

"లల్లెమ్మ ఆత్మహత్య చేసుకుందమ్మా ..." బావురుమన్నాడు శివరామయ్య.

"ఎందుకూ?"

"ఏమోనమ్మా?"

"రాస్కెల్! గెటవుట్!" గట్టిగా అరిచాడు రామకృష్ణ.

"ఏమిటండీ, మీ కేమైనా మతి పోయిందా?"

అడ్డం వచ్చిన నీరజను తోసిపారేసి, శివరామయ్య చొక్కా పట్టుకొని చేయి పైకెత్తాడు రామకృష్ణ.

పైకెత్తిన భర్త చేయి వేట కొడవలిలా కనిపించింది నీరజకు.

"ఏమిటండీ ఈ పిచ్చికోపం ..." తన శక్తంతా ఉపయోగించి రామకృష్ణను దూరంగా లాగింది.

తలవంచుకొని శివరామయ్య వెనక్కు తిరిగాడు.

భర్త ప్రవర్తనకు దిగ్భ్రాంతురాలైన నీరజ రామకృష్ణ ముఖంలోకి చూస్తూ అలాగే నిలబడి పోయింది.

తాను ఎంతోసేపట్నుంచి అడుగుతున్న ప్రశ్నకు రామకృష్ణ కళ్ళలో మండుతున్న కోపం జవాబుగా కనిపించింది నీరజకు.